లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌తో ఉచిత న్యాయసేవ

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

జైళ్లలో ఏళ్ల తరబడి ఉంటున్న రిమాండ్ ఖైదీలకు అవసరమైన మేరకు బెయిల్, ఇతర న్యాయసేవలు పొందడానికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పనిచేస్తోందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో జరిగిన కార్యకలాపాలపై చర్చించి అందుకనుగుణంగా సేవలను ప్రజలకు అందించాలన్నారు. జిల్లా జైలు సందర్శనలో గుర్తించిన ముద్దాయిలకు అవసరమైన బెయిల్ పిటిషన్లను త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రీ లోక్ అదాలత్ నిర్వహించి న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ రెండు కేసులను పరిష్కరించారు.

జోరందుకోని ధాన్యం కొనుగోలు

- జిల్లాలో నేటికీ 80 కేంద్రాల్లో ప్రారంభం కాని ధాన్యం సేకరణ
- 57 మంది బ్యాంకు గ్యారంటీలు సమర్పించని మిల్లర్లు
- ప్రతికూల వాతావరణ పరిస్థితులూ మరో కారణం
- ఇప్పటివరకు 65,750 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,59,495 ఎకరాల్లో వరి వేశారు. ఈ ఏడాది తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోనూ ఐదు లక్షల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావచ్చని పౌరసరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. అన్నీ లెక్క గట్టి చివరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందు కనుగుణంగా కొనుగోలు కోసం 402 కేంద్రాలను గుర్తించారు. జిల్లాలో ఇప్పటివరకు 322 కేంద్రాలు తెరుచుకున్నాయి. వీటి ద్వారా 65,750 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వాస్తవానికి గత నెల 17 నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించినా, కొనుగోలు మాత్రం నెలాఖరులోనే ప్రారంభమయ్యాయి. సరిగ్గా నూర్పులు, కోతలు ఊపందుకుంటున్న తరుణంలో వరుస అల్పపీడనాలు, తుపాను నేపథ్యంలో రైతులు వాయిదా వేసుకున్నారు.

> జిల్లాలో ధాన్యం కొనుగోలు ఇంకా జోరందుకోలేదు. డిసెంబరు రెండో వారంలోకి ప్రవేశిస్తున్నా, జిల్లాలో పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. అధికార యంత్రాంగంలో కొంత సన్నద్ధత కొరవడినట్లుగా కనిపిస్తోంది. ధాన్యం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నా చాలాచోట్ల తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు ప్రతికూల వాతావరణ పరిస్థితులూ ధాన్యం సేకరణకు అడ్డంకిగా మారింది. తుపాను, అల్పపీడనాల దృష్ట్యా చాలాచోట్ల రైతులు నూర్పులను వాయిదా వేసుకున్నారు. మరోవైపు వర్షాలు పడడంతో తేమ చేరిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారు.

బ్యాంకు గ్యారంటీలు సమర్పించని మిల్లర్లు

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేశారు. మిల్లులకు తరలించిన తర్వాత వాటిని మర ఆడించేందుకు 264 మిల్లులను ఎంపిక చేశారు. మర ఆడించేందుకు ఇస్తున్న ధాన్యం విలువకు సమానమైన బ్యాంకు గ్యారంటీలను మిల్లర్ల నుంచి పూర్తిస్థాయిలో బ్యాంకు గ్యారంటీలు సమర్పించలేదని తెలుస్తోంది. ఇప్పటివరకు 57 మంది వరకు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వలేదు.

దీంతో రైతు సేవా కేంద్రాలకు ధాన్యం రావడం తగ్గింది. ఇది ధాన్యం సేకరణపై ప్రభావం చూపింది.


లారీలకు ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు

మద్దతు ధర దక్కేనా?

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది వరికి సాధారణ రకానికి రూ.2,300, గ్రేడ్-ఎ రకానికి రూ.2,320 మద్దతు ధర ప్రకటించింది. గతేడాది కొంతమంది రైతులు తీసుకెళ్లిన ధాన్యం నాణ్యంగా లేవంటూ తిప్పిపంపారు. కొన్ని రైతు సేవా కేంద్రాల్లో తమ లక్ష్యం పూర్తయిందని, ఇక కొనలేమంటూ సిబ్బంది చెప్పడంతో, దళారులకు తక్కువ రేటుకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పటికే జలుమూరు, సారవకోట, నరసన్నపేట, బూర్జ, కొత్తూరు, హిరమండలం మండలాల్లో తక్కువ ధరకే రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం 80 కేజీల బస్తాకు రూ.1840 దక్కాల్సి ఉండగా, దళారులు రూ.1400కు కొంటున్నారు. అటు తూకంలోనూ అదనంగా రెండు నుంచి మూడు కేజీలు తీసుకుంటున్నారు.

నూర్పులకు రైతుల వెనకడుగు

వాతావరణ పరిస్థితులు బాగా లేకపోవడంతో ధాన్యం నూర్పులకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. తుపాను ప్రభావంతో ఈనెల 29 నుంచి రెండో తేదీ వరకు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి.

అక్కడ నుంచి ఆకాశం మేఘావృతంగానే ఉంది. ఏ క్షణంలో వర్షపు జల్లులు కురుస్తాయోనన్న ఆందోళనతో రైతులు నూర్పులు చేయకుండా వేచిచూస్తున్నారు. మరోవైపు ఈనెల రెండో వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందన్న వార్తలతో రైతుల్లో ఒకింత ఆందోళన నెలకొంది.

కొనుగోలు చేసింది 65 వేల టన్నులే...

జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 65,750 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కొన్ని మండలాల్లో కనీసం వంద టన్నులు కూడా కొనలేదు. వజ్రపుకొత్తూరు మండలంలో అత్యల్పంగా 20 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. బూర్జలో 49 మెట్రిక్ టన్నులు, పలాసలో 39 మెట్రిక్ టన్నులు, రణస్థలంలో 92 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఎచ్చెర్లలో 857 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. సారవకోటలో అత్యధికంగా 11,293 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. జలుమూరులో 8,888 టన్నులు, కొత్తూరులో 6,558 మెట్రిక్ టన్నులు, కోటబొమ్మాళిలో 6,055 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ

రెవెన్యూ సదస్సులకు పటిష్ట ఏర్పాట్లు

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ సదస్సులకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ, ఏర్పాట్లపై విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని, అధిక సంఖ్యలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలన్నారు.

కరపత్రాల పంపిణీకి చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాలో 1464 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, అందులో 738 రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 6వ తేదీన రెవెన్యూ సదస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని ఆహ్వానించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో నిర్వహించే సదస్సులకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముందస్తు ప్రచారం నిమిత్తం కరపత్రాల పంపిణీకి చర్యలు చేపడుతున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ, సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెటీరియల్ కాంపోనెంట్ పనులు మరింత వేగం

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.సుధాకరరావు సిబ్బందిని ఆదేశించారు. శ్రీకాకుళం రూరల్ మండలం బైరిలో బుధవారం పర్యటించిన ఆయన గోకులం, సిసి రహదారుల పనులను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 3303 సిమెంట్ రోడ్డు పనులు, 437 సిమెంట్ కాంక్రీట్ కాలువల పనులు ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.276.54 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. సంక్రాంతి నాటికి పల్లెల్లో కొత్త సిమెంట్ రోడ్లు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఫిష్ పాండ్స్, ఫారం పాండ్స్, ఇల్లు, కార్యాలయాల పైకప్పు నుంచి వచ్చే నీటిని ఒడిసిపట్టేందుకు వీలుగా ఇంకుడుగుంతలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెర్కులేషన్ ట్యాంకులు, గోకులాలు, వ్యక్తిగత ఇంకుడుగుంతలు, తదితర పనులను మండల స్థాయిలో శరవేగంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రారంభించిన ప్రతి పని వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ పనులకు నిధులు కొరత లేదని, ప్రతి గురువారం పనులు చేసిన మేరకు బిల్లులు నమోదు చేసి శుక్రవారం నాటికి చెల్లింపులు చేస్తున్నామన్నారు. పనుల పరిశీలనలో ఎపిఒ సీతారాం, జెఇ పి.బాలముకుంద బాబు, టిఎ రత్నాకర్ తదితరులున్నారు.

సమగ్ర దర్యాప్తుతో కేసుల ఛేదన

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సమగ్ర దర్యాప్తుతో ప్రాపర్టీ కేసులను త్వరితగతిన ఛేధించి, రికవరీ చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో లోక్ అదాలత్ కేసులు, ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో కేసులు, క్రైమ్ అగైనస్ట్ ఉమెన్, ప్రాపర్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులపై వర్చువల్ విధానంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న నిర్వహించే లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు అవకాశమున్న ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యే విధంగా ఇప్పట్నుంచే ప్రణాళికతో పనిచేయాలన్నారు. క్రైమ్ అగైనస్ట్ ఉమెన్, పోక్సో, ఎస్‌సి, ఎస్‌టి, ప్రాపర్టీ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో సమగ్ర దర్యాప్తుతో పురోగతి సాధించాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో లాస్ట్ ప్రాపర్టీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో కేసుల్లో 60 రోజుల్లోగా అభియోగ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులను పెంచాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన, జూదమాడినా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి, అక్రమ రవాణాకు అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

దళారులకు ధాన్యం ఇవ్వొద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర
- రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదు
- ఎపిఎస్‌సిఎంఎఫ్ ఎమ్‌డి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - బూర్జ, ఆమదాలవలస

రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు విక్రయించి మోసపోవద్దని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (ఎపిఎస్‌సిఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. బూర్జ మండలంలోని డొంకలపర్త, పెద్దపేట, ఆమదాలవలస మండలంలోని శ్రీహరిపురంలో రైతు సేవా కేంద్రాలు, రైస్‌మిల్లులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డొంకలపర్తలో అయ్యప్ప రైస్ మిల్లును తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించే క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో తూకం వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ గ్రామంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లగా, ఆ సమయంలో ధాన్యం సేకరణకు సంబంధించిన సాంకేతిక సహాయకులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అక్కడ సమీపంలో ఉన్న పంట పొలాల్లో ధాన్యాన్ని విక్రయాలకు సిద్ధం చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి వారితో నేరుగా మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఎందుకు దళారులకు విక్రయిస్తున్నారని రైతులను అడిగారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి తమకు తెలీదని రైతులు బదులిచ్చారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మద్దతు ధరకు విక్రయాలకు సంబంధించి రైతులకు అవగాహన కలిగించేలా ప్రచారం చేయకపోతే కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయోజనమేమిటని అధికారులను ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధరపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు.

శ్రీహరిపురంలోని సుందర్ రైస్‌మిల్లును తనిఖీ చేసి మిల్లర్లకు గన్నీలు ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుకు చేరే వరకు, అక్కడ నుంచి మిల్లింగ్ అయిన బియ్యం పౌరసరఫరాల శాఖకు చేరే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కస్టోడియన్‌కు ఎందుకు శిక్షణ ఇవ్వలేదని నిలదీశారు. కస్టోడియన్ విఆర్‌ఒ అప్పారావు వాహనం ఒకటి, ట్రక్ షీట్ వేరొకటి నమోదు చేయడంపై ప్రశ్నించగా తనకు ఇదే మొదటిసారి అని ధాన్యం కొనుగోలులో తనకు అవగాహన లేదని తెలిపారు. కస్టోడియన్లకు శిక్షణ ఇవ్వకపోవడంపై ఎఎస్ టెక్నికల్ శ్రీనివాసరావును ఎందుకు సస్పెండ్ చేయకూడదో వివరణ ఇవ్వాలన్నారు. తేమ శాతం పేరుతో రైతుల నుంచి అధిక ధాన్యాన్ని సేకరించినా మిల్లును సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ఆ కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లో రైతుల ఖాతాలకు డబ్బులు జమవుతాయని తెలిపారు. ఇప్పటివరకు 9,20,347 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేపట్టినట్లు చెప్పారు. రూ.2022.83 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. రైతులను మభ్యపెట్టి అక్రమంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే దళారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లర్లు తూకం విషయంలో సక్రమంగా వ్యవహరించాలని, అధికంగా తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లై డిఎం వేణుగోపాల్, ఆమదాలవలస తహశీల్దార్ రాంబాబు, ఎఒ మెట్ట మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


బూర్జ : రైతులతో మాట్లాడుతున్న మనజీర్ జిలానీ సమూన్


మాట్లాడుతున్న రైస్‌మిల్లర్ల సంఘం నాయకులు గోపాలకృష్ణ

వేతన ఒప్పంద చర్చలు విఫలం

ప్రజాశక్తి - పలాస

వేతన ఒప్పందానికి సంబంధించి రైస్ మిల్లర్లు, కార్మిక సంఘ నాయకుల మధ్య చర్చలు విఫలమయ్యాయి. స్థానిక ఒక మిల్లులో బుధవారం నిర్వహించిన చర్చలు కొలిక్కి రాకపోవడంతో వాయిదా పడ్డాయి. రైస్ మిల్లులో పనిచేసే కార్మికులకు రెండేళ్లకోసారి వేతన ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. గత వేతన ఒప్పందం పూర్తయి రెండేళ్లు దాటడంతో తమ వేతనాలు 45 శాతం పెంపుదల చేయాలని కోరుతూ కాష్యూ, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ నాయకులు యాజమాన్యానికి నోటీసులు అందించారు. చర్చల్లో కనీసం 40 శాతం వేతనాలు పెంచాలని కార్మిక సంఘ నాయకులు పట్టుబట్టారు. అందుకు యజమానులు అంగీకరించకపోవడంతో చర్చలు వాయిదా పడ్డాయి. దీనిపై మరోమారు చర్చలు జరపాలని నిర్ణయించారు. సమావేశంలో రైస్‌మిలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డోకి రామారావు, కె.వి గోపాల్, కోశాధికారి సిందిరి కిషోర్, పెంట శ్రీను, కాష్యూ, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అంబటి కృష్ణమూర్తి, సాన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల వద్ద మురుగు సమస్యను పరిష్కరించాలి

కమిషనర్‌ను కోరిన ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలోని వసతిగృహాల వద్ద మురుగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, బాలికల విభాగం కో-కన్వీనర్ దివ్య నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వి.వి.డి ప్రసాదరావును కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబరులో ఆయన్ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విశాల మైదానం గల మహిళా కళాశాలలో విద్యార్థినుల సంరక్షణలో భాగంగా గిరిజన, సాంఘిక సంక్షేమ, బిసి, వికలాంగుల వసతిగృహాలు ఉన్నాయని చెప్పారు. వీటి నుంచి వస్తున్న వాడుక నీరు, వ్యర్థాలు వెళ్లేందుకు కాలువల్లేక మురుగునీరు పేరుకుపోతోందని చెప్పారు. సుమారు 800 మంది విద్యార్థినులు ఈ వసతిగృహాల్లో ఉంటున్నారని వివరించారు. వారు వినియోగించే వాడుక నీరు వెళ్లేందుకు అవుట్‌లెట్ లేక కళాశాల ఆవరణలో మురుగునీరు చేరుతోందని వివరించారు. కళాశాల విద్యార్థినులతో పాటు వసతిగృహాల్లో ఉన్న వారు, చుట్టూ నివాసముంటున్న వారు మురుగునీరు వల్ల అవస్థలు పడుతున్నారని వివరించారు. దోమలు విపరీతంగా పెరిగి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. మురుగునీరు వెళ్లేందుకు వీలుగా కాలువలను నిర్మించాలని కోరారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఖగేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి కమిటీల ఏర్పాటు

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి జి.వి త్రినాథరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి సమిష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి జి.వెంకట త్రినాథరావు నాయకులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామగ్రామాన విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు చేయాలని సూచించారు. జిల్లాలో నియోజక ఇన్‌ఛార్జిలను నియమించినట్లు తెలిపారు. ఇచ్ఛాపురం ఇన్‌ఛార్జిగా మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, పలాసకు మజ్జి త్రినాథబాబు, టెక్కలికి దుంపల రామారావు, నరసన్నపేటకు మామిడి సత్యనారాయణ, శ్రీకాకుళంకు అంబటి కృష్ణారావు, ఆమదాలవలసకు బొచ్చ వెంకటరమణ, పాతపట్నంకు మజ్జి మురళీమోహన్, ఎచ్చెర్లకు ఆబోతుల వెంకటనాయుడును నియమించినట్లు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. కుల గణన చేయాలని రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వానికి ఎంతచెప్పినా పెడచెవిన పెడుతోందన్నారు. కుల గణనతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎం.ఎస్ బేగ్ (చాన్ బాషా) మహమ్మద్ ఉస్మాన్ బేగ్, సైదుల్లాఖాన్‌కు కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు.


మాట్లాడుతున్న త్రినాథరావు


మాట్లాడుతున్న విజయగౌరి

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- కవిటి

విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ, ఉద్యోగ అధ్యాపకులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యారంగంపై తనకు ఉన్న అవగాహనను దృష్టిలో ఉంచుకొని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కెజిబివి ఉపాధ్యాయులకు కనీస వేతనం కోసం పిడిఎఫ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో అశాస్త్రమైన పాఠశాల పని వేళలు, వంద రోజుల ప్రణాళికలు, యాప్‌ల భారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, దీనికోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు కె.దాలయ్య, జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి వి.సీతంనాయుడు, జిజె కాలేజ్ ప్రిన్సిపాల్ పేడాడ రాజేశ్వరరావు, జి.జానకిరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవీంద్ర

విజయగౌరిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి- కొత్తూరు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చౌదరి రవీంద్ర పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గత నెల 24 నుంచి ఈ నెల 9 వరకు రెండో విడత ఓటర్లకు అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులను భోదనేతర పనులు నుంచి తప్పించాలన్నారు. బోధనేతర పనులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేకపోతున్నామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు దండు ప్రకాశరావు, బోడ శ్రీను, కొత్తూరు మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విజయ్‌కుమార్, వి.మధుసూదనరావు, ఆర్.ఆర్.కొండలరావు, దినేష్, లక్ష్మీనారాయణ, శోభన్‌బాబు పాల్గొన్నారు.

మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు

ఇచ్ఛాపురం : స్థానిక సురంగరాజా క్రీడా మైదానంలో బుధవారం మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో బాలురు విభాగంలో వాలీబాల్, కబడ్డీ, టెన్నికాయిట్, బాలికల విభాగంలో ఖోఖో, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఇఒ కె.అప్పారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కె.పద్మనాభరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మశ్రీ, సాజన్ గణేష్, రవి, వజీర్, ధర్మరాజు, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కిశోరి వికాసం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సిడిపిఒ సిహెచ్ ఝాన్సీబాయి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు, ఎఎన్ఎంలకు, మహిళా పోలీసులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఉపాధ్యాయులు, ఆధ్యాపకులకు కిశోరి వికాసంపై మండలస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎఒ వి.ధనుంజయ రావు, ఎంఇఒ ఎ.త్రినాథరావు, మెడికల్ ఆఫీసర్ బివిపి అనుష, ఎస్ఐ ఎస్.చిరంజీవి, టి.మంగమ్మ, కె.నారాయణ మూర్తి, గీతారాణి వివిధ అంశాలపై గ్రామస్థాయి అధికారులకు, ఉపాధ్యాయులకు శిక్షణ అందజేశారు. ముఖ్యంగా 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు ఉన్న ఆడపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలు, బాల్య వివాహాలు, సమాజంలో మెలుకువలు, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ కిశోరి వికాస కార్యక్రమాన్ని విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఆమదాలవలస: మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం-2 శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ రోణంకి వెంకటరావు పాల్గొన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ నేరాలపై గ్రామస్థాయి రిసోర్స్ గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ ఎస్.అనురాధ, ఎంఇఒ-2 టింగరాజు, తొగరాం, అక్కులపేట వైద్యులు ఎం.స్రవంతి, కె. మీనాకుమారి, ఇఒపిఆర్‌డి గోపాలరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీబాయ్, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

మందస : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మెడికల్ ఆఫీసర్ సంతోష్ అన్నారు. స్థానిక మండల కాంప్లెక్స్‌లో బుధవారం కిశోరి వికాసంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే పుట్టే పిల్లల ఎదుగుదల విషయంలో చాలా అనర్థాలు ఉంటాయని అన్నారు. కౌమార దశ నుంచే విద్యను ముందు అభ్యసించాలన్నారు. తరువాత ఉద్యోగం, 18 ఏళ్ల దాటిన తరువాత పెళ్లి కోసం ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎంఇఒ లక్ష్మణరావు, సిపిడిఒ స్వరాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ వసుంధరదేవి, ఎఒ రుశ్వేశ్వరరావు అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నౌపడ : మహిళల ఆరోగ్యం, రక్షణపై అవగాహన కలిగి ఉంటే చాలా సమస్యలు నివారించవచ్చని ఐసిడిఎస్ సిడిపిఒ మనోరమ అన్నారు. సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.జయంతిప్రసాద్ ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశాలకు, మహిళా పోలీసులకు కిశోరి వికాసంపై శిక్షణ ఇచ్చారు. బాలికల అక్రమ రవాణా, రుతుక్రమణ జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత


మందస : మాట్లాడుతున్న వైద్యాధికారి సంతోష్


రణస్థలం : మాట్లాడుతున్న సిడిపిఒ ఝాన్సీబాయి

నివారణ చర్యలు, ఆత్మరక్షణ, బాలల చట్టం, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిడిపిఒ రూపలత, ఇఒపిఆర్‌డి పద్మజ, సంతబొమ్మాళి మెడికల్ ఆఫీసర్ డి.వనిత, ఎంఇఒ చిన్నవాడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : బాల్యవివాహాలు వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని సిడిపిఒ నాగరాణి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కిశోరి వికాసం శిక్షణ ఇచ్చారు. కమిషనర్ రమేష, యువ సూర్య ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఎం.రాంబాబు, డాక్టర్ కళ్యాణి, రజనీకుమారి, మీనాక్షి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీలకు, ఆశా, మహిళా పోలీసులకు ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ కిశోరి వికాసంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎల్.వి.ప్రతాప్, వైద్యాధికారి డాక్టర్ ఎం.మనీషా, ఇఒపిఆర్‌డి జె.అనందరావు, జూనియర్ కళాశాల అధ్యాపకులు వై.మాధవి, ఎస్ఒటి ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, తదితరులు

రామినాయుడుపై విఆర్‌ఒల ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న విఆర్‌ఒలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తోలాపి సచివాలయంలో విఆర్‌ఒ దేవాకర్‌రావుపై ఎంపిటిసి భర్త పప్పల రామినాయుడు దాడి చేసిన సంఘటనపై బుధవారం స్థానిక పోలీసులకు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం తరుపున ఫిర్యాదు చేశారు. తోలాపి ఎంపిటిసి పప్పల కళ్యాణి భర్త పప్పల రామినాయుడు మంగళవారం మధ్యాహ్నం మద్యం మత్తులో సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న దేవాకర్‌రావుపై దాడిచేసిన సంఘటన పాఠకులకు తెలిసిందే. విధి నిర్వాహణలో ఉన్న విఆర్‌ఒపై అకారణంగా దాడిచేసి గొంతు నులిమి, నేలపై తోసి చంపేందుకు ప్రయత్నించిన రామినాయుడుపై భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతకు ముందు తహశీల్దార్ కార్యాలయం ఎదుట విఆర్‌ఒల సంఘం ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్ ఆదేశంతో...

సచివాలయంలో విఆర్‌ఒపై దాడి చేసి కంప్యూటర్‌ను ధ్వంసం చేయడంపై కలెక్టర్ ఆగ్రహం చెందారు. తక్షణమే దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎంపిడిఒ మన్మథరావును ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో ఎంపిడిఒ, సచివాలయ కార్యదర్శి కూన వినోద్‌లు పోలీస్‌స్టేషన్‌లో దాడి చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

పలాస : పొందూరు మండలం తోలాపి విఆర్‌ఒ దివాకరపై ఎంపిటిసి ప్రతినిధి చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని విఆర్‌ఒల సంఘం నాయకులు కొర్ల శ్రావణ్ కుమార్ అన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న విఆర్‌ఒపై దాడి చేయడం అన్యాయమని అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ

ప్రజాశక్తి- పాతపట్నం

దసరా సెలవుల తరువాత మోడల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలపై సమగ్ర నివేదిక అందించాలని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. మండలంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థిని మృతికి కుటుంబ సభ్యుల ఒత్తిడి, ఉపాధ్యాయుల వేధింపుల, ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే అనే దిశగా సమగ్ర విచారణ త్వరితగతిన చేపట్టి నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపాల్ రాధాకృష్ణను సూచించారు. అనంతరం పాతపట్నంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు రెండెకరాలు, మినీ బ్యాడ్మింటన్ కోర్టుకు రెండెకరాలు, ప్రభుత్వ పెట్రోల్ బంకుకు స్థలాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు తహశీల్దార్ కిరణ్ కుమార్, సర్వేయర్ రామగణపతి, ఆర్ఐ బాబి ఉన్నారు.


విచారణ చేస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

వ్యక్తికి జైలుశిక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించిన ఓ వ్యక్తికి శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి 14 రోజులు జైలుశిక్ష విధించారు. బుధవారం శ్రీకాకుళం వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో కంద్ర వీధికి చెందిన బొమ్మలాట హరికృష్ణ (రౌడీషీటర్) బహిరంగంగా మద్యం సేవించడంతో పాటు ప్రజలతో ఇబ్బందికరంగా ప్రవర్తించడంతో ఆ వ్యక్తిని గుర్తించి ఒన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చడంతో జడ్జి శివ రామకృష్ణ 14 రోజులు హరికృష్ణకు జైలు శిక్ష విధించారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి- నందిగాం


లిఖిత (ఫైల్)

మండలంలోని తురకలకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అదే గ్రామానికి చెందిన కొండాల నిఖిత (15) అనారోగ్యంతో మృతి చెందింది. పది రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని కెజిహెచ్‌జిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు లక్ష్మి, మల్లేశ్వరరావు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

జమ్మూ ఐఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 'పైడి'


ప్రజాశక్తి- ఆమదాలవలస


అనిల్ కుమార్

పురపాలక సంఘంలోని రెండోవార్డు కృష్ణాపురానికి చెందిన పైడి అనీల్ కుమార్ జమ్మూలోని ఐఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్స్ విభాగానికి ఈయన ఎంపికయ్యారు. అనిల్‌కుమార్ ప్రాథమిక విద్య సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస నవోదయ విద్యాలయంలో కొనసాగింది. ఐఐటి మద్రాసులో కెమిస్ట్రీ విభాగంలో పిహెచ్‌డి చేశాడు. సోలిడ్ స్టేట్ కెమిస్ట్రీలో పోస్ట్ డాక్టరల్ రీసెర్చ్ చేశాడు. అలాగే ఐఐటి బాంబేలో లిథియం అయాన్ బ్యాటరీ డెవలప్‌మెంట్‌లో పోస్ట్ డాక్టరల్ రీసెర్చ్ చేశాడు. సౌత్ కొరియాలో లిథియం, సోడియం బ్యాటరీ డెవలప్‌మెంట్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. అనిల్ కుమార్ తల్లిదండ్రులు పైడి నారాయణమూర్తి, వెంకట సత్యవతి సాధారణ కుటుంబీకులు. తండ్రి నారాయణమూర్తి పట్టణంలో అనీల్ సప్లయర్స్ నడుపుతూ కుటుంబ జీవనం కొనసాగిస్తున్నారు. అనిల్ కుమార్ భార్య ఉషారాణి గృహిణి. అనిల్ కుమార్ ఐఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొలువు సాధించడంపై బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరి పంటకు మొలకలు

ప్రజాశక్తి- పొందూరు


మొలకెత్తిన వరి పంట

ఇటీవల కురిసిన వర్షాలకు వరిసాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. కోతకోసిన వరిపంట పొలాల్లో ఉండిపోవడంతో నాలుగురోజుల పాటు కురిసిన వర్షాలకు తడిసిపోవడంతో మొలకలు వచ్చాయి. మండలం బొడ్డేపల్లి మొదలవలస, కింతలి, తోలాపి తదితర గ్రామాల్లో మొలకలతో వరిపంటకు తీవ్ర నష్టం సంభవించింది. చేతికి అందివచ్చిన పంట వర్షాల కారణంగా నష్టం సంభవించడంతో రైతులు ఆందోళనం వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రైతులకు పంటనష్టం అందించాలని ఎంపిటిసి మొదలవలస సీతారామారావు, టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ బి.సత్యం తదితరులు అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


లావేరు : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- లావేరు

రైతు సంక్షేమమే సిఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం లావేరు మండల కేంద్రంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొన్న ధాన్యానికి 48 గంటల్లోనే రైతులు ఖాతాల్లో కి నగదు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, తహశీల్దార్ ఎన్ని జోగారావు, ఎంపిడిఒ వెంకటరాజు, మాజీ ఎంపిపి ఎం.వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, ఎం.చంటిబాబు, సిఇఒ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం వెంకటాపురానికి చెందిన పొట్నూరు అనురాధకు సిఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ. 5 లక్షల 33, 624 చెక్కును అందజేశారు.

రణస్థలం రూరల్: మండలంలో పైడిభీమవరం పిఎసిఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, ఎంపిడిఒ ఈశ్వరరావు, పిఎసిఎస్ సిఇఒ గిరి బుచ్చి రంగనాథం, వ్యవసాయ శాఖ ఉపసహాయ సంచాలకులు శ్రీనివాస్, సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, గొర్లె లక్ష్మణరావు, పైడి అప్పడు దొర, నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రారంభించారు.

రేపట్నుంచి రెవెన్యూ సదస్సులు


మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు

లావేరు : భూ సమస్యలు, రీసర్వే సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎన్ని జోగారాలు తెలిపారు. 6న తాళ్లవలస, 7న గుమ్మడాం, 9న బెజ్జిపురం, 10న తామాడ, 11న లక్ష్మిపురం, రేగపాళెం, 12న నేతేరు, పెంట, 13న బుడుమూరు, 16న పెదరావుపల్లి, చెల్లయ్యమ్మ, అగ్రహారం, 17న గురుగుబిల్లి, సుభద్రపురం, 18న కేశవరాయునిపాళెం, 19న సహపురం, హనుమంతుపురం, 20న పెద్దకొత్తపల్లి, విజయరాంపురం, 21న కొత్తకుంకం, పైడయ్యవలస, 23న కొత్తకోట, 24న వెంకటాపురం, అప్పాపురం గ్రామాల్లోను, 26న అదపాక, 27న పాతకుంకాం, కొండకుంకాం, 28న మురపాక, 30న లావేరు, 31న రావివలస, సిర్లపాళెం, జనవరి 2న వేణు గోపాలపురం, నాగంపాళెం, 3న బుడతవలస, నీలాపురం, 4న సిగురు కొత్తపల్లి, వెంకట్రావుపేట, 6న గోవిందపురం, భరనికాం, 7న పెదలింగాల వలస, పోతయ్యవలస, 8న కేశవరాయనిపురం, జిజివలస గ్రామాల్లో సదస్సులు జరుగుతాయన్నారు. రైతులు తమ భూ సమస్యలపై వినతిపత్రాలు అందజేసి సమస్యలు పరిష్కారం చేసుకొవాలని కోరారు.

శిమ్మన్నకు డాక్టరేట్


డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న విసి రజని

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని వడ్డివాడకు చెందిన నక్క శిమ్మన్నకు డా.బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈయన బయో టెక్నాలజీ విభాగంలో డా.ఎస్.ఉదయ్ భాస్కర్ పర్యవేక్షణలో 'లవణీయతను తట్టుకొని మొక్కల పెరుగుదలను ప్రోత్సహించే రైజోబియం బాక్టీరియంపై అధ్యయనం, వరిపై వాటి ప్రభావం' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీను ప్రదానం చేశారు. ఈయన రాసిన పరిశోధనా వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రజనితో పాటు రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఇతర అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఈయన ప్రస్తుతం భారత ఆహార సంస్థలో పని చేస్తున్నారు. శిమ్మన్నకు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు


వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మాదకద్రవ్యాలు, మత్తుపదార్ధాల జోలికిపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ డిఎస్‌పి ఎం.వెంకట అప్పారావు హెచ్చరించారు. మండలంలోని పూండిలోని సాయివినీత్ విద్యా సంస్థలో అధినేత డాక్టర్ కె.లీల అధ్యక్షతన సంకల్పం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడదాం అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ డ్రగ్స్ అలవాటు బానిసై జీవితాలు బుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. చెడు స్నేహాలు, ర్యాగింగ్‌లకు పాల్పడి అందమైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అపరిచితులు పంపించే లింక్‌లను క్లిక్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.నిహార్, కళాశాల ప్రిన్సిపాల్ అన్నెపు కైలాషరావు, అధ్యాపకులు జి.సాయిగోపాల్, బత్తిన శ్రీనివాసరావు, బి.ధర్మారావు పాల్గొన్నారు.

బూర్జ : విద్యార్థులు మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం.ప్రవళ్లిక అన్నారు. బుధవారం మండలం ఒవిపేట ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు గురి కాకూడదని, మీ భవిష్యత్‌ను మీరే బాగు చేసుకోవాలన్నారు. విద్యపై శ్రద్ధ వహించాలన్నారు. తరగతి గదుల్లో సోదర భావాన్ని చూపాలన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


బూర్జ : మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవళ్లిక

శ్రీకాకుళం అర్బన్: పట్టణంలోని బలగ మున్సిపల్ హైస్కూల్లో సంకల్పం కార్యక్రమంలో భాగంగా టూటౌన్ ఎస్ఐ సంతోష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని 16వ వార్డు పరిధిలోని ప్రధాన రహదారిలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు విత్తన బంతుల తయారీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


విత్తన బంతులను తయారీ చేస్తున్న విద్యార్థులు

నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు బుధవారం విత్తన బంతుల తయారీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ రాష్ట్ర వ్యవసాయ విభాగ కో-ఆర్డినేటర్ దార్లపూడి రవి నేతృత్వాన సుమారు 300 మంది విద్యార్థులు 4,500పైగా నాణ్యమైన విత్తన బంతులను తయారు చేశారు. ప్రపంచ మృత్తికా (మట్టి) దినోత్సవాన్ని పురష్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత మట్టి తీరు, రకాలు, ప్రయోజనాలు, కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరాన్ని అవగహన కల్పించారు. విత్తన బంతులను రానున్న రోజుల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు అడవుల్లోను, చెట్లులేని ప్రదేశాల్లోను విసురుతారని, వర్షాలు కురిశక అవి మొక్కలుగా వృద్ధి చెందడానికి వీలవుతుందని ఆయన వివరించారు. సేంద్రియ వ్యవసాయం, ఉత్పతులను ప్రోత్సాహించాల్సిన బాధ్యత విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త త్రివిక్రమ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి సురేంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేట్లు, రైస్ మిల్లర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం వాహనాలకు జిపిఎస్ డివైస్ అమర్చడానికి టెక్నీషియన్లు వస్తున్నారని అన్నారు. వాహనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయి డిటి సంతోష్‌కుమార్, మండల ఎఒ భార్గవి పాల్గొన్నారు.


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి- నౌపడ

మాదకద్రవ్యాలు విక్రయం, వినియోగిస్తూ... పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని నౌపడ ఎస్ఐ నారాయణస్వామి హెచ్చరించారు. నౌపడలో బస్టాండ్ ఆవరణలోని పలు దుకాణాలు, పాన్ షాపుల్లో బుధవారం డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు గుర్తించేందుకు డాగ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాల వాడకంపై సమాచారం తెలిస్తే పోలీసులకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీరామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానిస్తున్న అభిమానులు

కృష్ణంనాయుడుకు అభినందనలు


పోలాకి : కళింగ కార్పొరేషన్ ఛైర్మన్‌గా రోణంకి కృష్ణంనాయుడు ఇటీవల విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం స్వగృహానికి చేరుకోవడంతో అభిమానులు చేరుకుని అభినందనలు తెలిపారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయు డు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌లకు కృష్ణంనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి

ప్రజాశక్తి- కవిటి

కవిటి సచివాలయం-2లో వ్యవసాయ సహాయకుడుగా పనిచేస్తూ ఎఇఒగా ఉద్యోగోన్నతి పొందిన బెందాళం శ్రీకళ్యాణ్ భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయనకు సచివాలయ సిబ్బంది బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనంలోనే ఉద్యోగ జీవితంలో విశేష ప్రతిభ కనబరిచి ఉద్యోగోన్నతి పొందిన శ్రీకళ్యాణ్ తోటి సచివాలయ ఉద్యోగులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఇఒ వీరభద్ర స్వామి, విఆర్‌ఒ నారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు


సమస్యను వివరిస్తున్న మహిళలు

తాగునీటి కోసం అవస్థలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని కొత్తపేటలో నెల రోజుల నుంచి తాగునీటి సౌకర్యంలో లేక దాహంతో అల్లాడిపోతు న్నామని మహిళలు వాపోయారు. ఈ మేరకు ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ మంగరాణికి తమ సమస్యలను విన్నవించుకున్నారు. 2019లో తమ పరిధిలో నిర్మించిన రక్షిత తాగునీటి పథకం పనిచేయటం లేదని అన్నారు. ట్యాంకుకు లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతుందన్నారు. తమ పరిదిలోని బోరుబావిలు వినియోగిస్తేంటే వాటి నుంచి వచ్చిన నీరు పింపుర వాసన వచ్చి తాగలేకపోతు న్నామని వాపోయారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంగరాణి స్పందించి ఆర్‌డబ్ల్యుఎస్ జెఇతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, వెళ్లి పరిశీలించి తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.


ఎస్ఐని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

శాంతిభద్రతలపై దృష్టి

ప్రజాశక్తి- కవిటి

మండలంలో శాంతిభద్రతలపై దృష్టి సారించాలని ఎస్ఐ రవివర్మను నాయకులు బెందాళం జయప్రకాష్, పూడి నీలాచలం, దేవరాజ్ సాహు కోరారు. ఇటీవల కవిటి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రవివర్మను బుధవారం వైసిపి నాయకులు కలిసి ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం వీరు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ముఖ్య కూడలిలో రోజురోజుకూ పెరిగిపో తున్న ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాండవ చంద్రశేఖర్, శివబిశాయి, దువ్వు కృష్ణారెడ్డి, జల్లు యుగంధర్, బదకల భాస్కరరావు, జల్లు నరేష్, వై.సత్యం పాల్గొన్నారు.


ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడకు చెందిన టిడిపి కార్యకర్త పట్టా సూర్య నారాయణ గత కొంతకాలంగా అనారోగ్యం బారిన పడి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సూర్యనారాయణ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గ్రామంలోని నాయకులు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సిఎం చంద్రబాబు నాయుడును కలిసి సిఎం సహాయ నిధి నుంచి రూ.12 లక్షల సహాయాన్ని ప్రకటించారు. సిఎం మంజూరు చేసిన నగదు పత్రాలను ఎమ్మెల్యే రవికుమార్ బుధవారం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందించారు.


బాషాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విధి నిర్వహణలో ఉద్యోగి అందించిన సేవలే గుర్తింపునిస్తాయనిఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞానభవన్‌లో బుధవారం ఆర్‌టిసి ఉద్యోగి బాషా ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఉద్యోగం అనంతరం శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆర్‌టిసి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న తహశీల్దార్ రమేష్‌కుమార్

రేషన్ పంపిణీ పరిశీలన

కంచిలి : కంచిలి మండల కేంద్రంలో బుధవారం రేషన్ పంపిణీని తహశీల్దార్ రమేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుదారులతో మాట్లాడుతూ సరుకులు సక్రమంగా అందుతున్నది, లేనిది అడిగి తెలుసుకున్నారు. తూనికలు, వస్తువుల నాణ్యతపై ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 58 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో కార్యదర్శులతో, విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను 45 రోజుల్లోగా పరిష్కరించి, వాటి నివేదికలను కలెక్టర్‌కు పంపించాలన్నారు.


ప్రారంభిస్తున్న ఎఎం ధనుంజయం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పోలేరులో ఎఎం ధనుంజయం బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇచ్చిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు డబ్బు జమ చేస్తామన్నారు. దళారీల ప్రమేయం లేకుండా రైతులకు నేరుగా పంట సొమ్మును అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు, రైతులు పాల్గొన్నారు.


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు నమూనా పరీక్షలు

ప్రజాశక్తి- మందస

విద్యార్థులు చదువుతున్న తరగతి స్థాయిని పరీక్షించడానికి నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే (నాస్) పరీక్షలు కీలకమని ఎంఇఒ ఎం.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని మందస, సింగుపురం ఎస్‌ఆర్‌ఎస్ పాఠశాలల్లో నాస్ మోడల్ పరీక్ష బుధవారం నిర్వహించారు. ఈ పరీక్షలు పక్కాగా నిర్వహించామని ఒమరవెల్లి డైట్ విద్యార్థి బిందు మాధవి తెలిపారు. ఈ పరీక్షకు 28 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన వంగడాలతో మేలైన దిగుబడి

ప్రజాశక్తి- కవిటి

రైతులు ఒకే రకమైన వంగడాలు సాగు చేయకుండా కొత్త వంగడాలు సాగు చేస్తే తెగుళ్లు, పురుగులు బెడద తట్టుకుని మేలైన దిగుబడులు సాధించవచ్చని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు తెలిపారు. మండలంలోని వరకలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఈ ప్రాంతానికి అనువైన ఆర్‌జిఎల్ 7039 నూతన వంగడాన్ని మినీ కిట్ రూపంలో అందించనున్నట్లు తెలిపారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం నుంచి రాగి విత్తనాలైన గోస్తాని, హిమ అనే కొత్త వంగడాలు మినీ కిట్ రూపంలో రైతులు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఈ వంగడాల ద్వారా తమకు కావాల్సిన విత్తనాలు తయారు చేసుకుని సాగు చేసుకోవాలని సూచించారు. ఉద్యానవనశాఖ అధికారి మాధవీలత మాట్లాడుతూ నీటి సదుపాయం ఉన్న కొబ్బరి తోటల్లో అంతరపంటగా కోకో వేసుకోవాలని


కవిటి : మాట్లాడుతున్న జగన్మోహనరావు

సూచించారు. తమ శాఖద్వారా అందిస్తున్న పథకాలు వివరించారు. స్థానిక నాయకుడు శ్రీకాంత్ పురియా మాట్లాడుతూ ధాన్యం సేకరణ కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేసి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ బడగల దుర్గాప్రసాద్, ఎఇఒ బెందాళం శ్రీకళ్యాణ్, విఆర్‌ఒ కూర్మనాయకులు, వ్యవసాయ సహాయకులు జగదీష్, లలితకుమారి, మహేష్ జెన్నా, అప్పలరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

పలాస : ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని ఉద్యానవనశాఖ అధికారి శంకర్‌దాస్ సూచించారు. మండలంలోని బొడ్డపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జీడి, కొబ్బరి, పనస పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఎఒ పోలారావు, టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, తెప్పల పావని పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రబీలో పండించే పంటలు మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ, రాగులు, వరి పంటలకు రైతు నేరుగా పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని మండల ఎఒ దాణకర్షుడు తెలిపారు. మండలంలోని శేఖరాపురం, బాణాపురం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీకి సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఖగేశ్వరరావు, మోహనరావు పాల్గొన్నారు.


తరగతి గదిని పరిశీలిస్తున్న బాలాజీ

గురుకుల పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి- పాతపట్నం

పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకోవాలని, విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయ అధికారి ఎన్.బాలాజీ అన్నారు మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని, డార్మెటరీని, మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, దుప్పలవలస ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, తామరపల్లి ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణతార, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న కమిషనర్ రమేష్

విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పుస్తక పఠన ప్రియులకు అవసరమైన అన్నిరకాల పుస్తకాలను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అందుబాటులోకి తెస్తుందని, మారుతున్న సాంకేతిక రంగంతో పోటీపడుతూనే పాఠకుల అభిరుచులకు అనుగుణంగా ప్రచురణలు నిరంతరంగా చేస్తుండడం గర్వకారణమని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంచార పుస్తక విక్రయ వాహన కేంద్రాన్ని న్యాయవాది నాగరాజ్ పాత్రోతో కలిసి బుధవారం ప్రారంభించారు. ముందుగా పుస్తక కేంద్రం ఇన్‌ఛార్జి నషీర్ పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు.

ఆలోచనలు పంచుకోవడానికి వేదికలు దోహదం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆలోచనలను పంచుకోడానికి వేదికలు దోహదపడతాయని జెఎన్‌టియుజివి అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు అన్నారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఐటి రూర్కెలా సౌజన్యంతో 'ఇన్నోవేటివ్ ప్రొడెక్ట్ డిజైన్ అండ్ ఇంటిలి జెంట్ మేనిఫేక్చరింగ్ సిస్టమ్స్' (ఐసిఐపిడిఐఎంఎస్) అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ల్యాబ్‌లను సమాజంలోని సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు. ఒకరి వద్ద పనిచేసే వారుగా కాకుండా... పది మందికి ఉద్యోగాలు ఇచ్చేవారుగా ఎదగాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ రోబోల ఆవశ్యకత పెరుగుతుందన్నారు. ప్రపంచం ఆర్టిఫిషియల్



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

ఇంటిలిజెన్స్ అండ్ మిషన్లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. వీటిపై నిరంతరం పరిశోధనలు చేపట్టామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, కన్వీనర్, సిఎస్ఇ హెచ్‌డి డాక్టర్ వై. రమేష్ సదస్సు ఆవస్యకతను వివరించారు. సదస్సులో డీన్లు, హెచ్‌ఐలు, సదస్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం. జయంతిరావు, పరిశోధన చేసే విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'నగర వనం' పనులు

పలాస: పలాస-కాశీబుగ్గ పట్టణానికి సమీపంలోని అటవీశాఖ అన్ని సదుపాయాలతో నగరవనం తీర్చిదిద్దుతుందని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు పేర్కొన్నారు. కాశీబుగ్గ మున్సిపాలిటీ సమీపంలో నిర్మాణంలో ఉన్న నగరవనం పనులను అటవీశాఖ రేంజ్ అధికారి మురళీకృష్ణం నాయుడుతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చేపట్టిన పనులను అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి ప్రేమికులను ఆకర్షించే విధంగా ప్రతిఒక్కరూ ఉత్సాహంగా, ఉల్లాసంగా నగరవనాన్ని దర్శించే విధంగా అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దాలన్నారు. పట్టణం కాంక్రీట్ జంగిల్‌గా మారిన పరిస్థితుల్లో ప్రకృతిని ఆస్వాదించడానికి, పట్టణ వాసులకు, పరిసర ప్రాంత ప్రజలకు ఈ వనం పెద్ద ఊరట కలిగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోన కృష్ణారావు, దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, నందిగాం ధర్మారావు, డి.కె.రామారావు, ఆర్.జి. తులసీరావు, బమ్మిడి విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఎంపిపి రైస్‌మిల్లుకు అనుమతులు ఇవ్వొద్దు


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలో ఎంపిపికి చెందిన రైస్ మిల్లుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసే అవకాశాన్ని ఇవ్వొద్దంటూ టిడిపి మండల నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు పార్టీ నాయకులు మాదిన రామారావు బి.కొరయ్య పురుషోత్తంరెడ్డి తదితరులు రైతులతో కలిసి బుధవారం తహశీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గత వైసిపి హయాంలో ఎంపిపిగా ఉన్న వ్యక్తి తన మిల్లు ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు సక్రమంగా ధాన్యం సొమ్ము చెల్లించలేదని ఆరోపించారు. అలాగే ఒడిశా నుంచి ధాన్యం తెచ్చి ఇక్కడ ప్రభుత్వానికి అమ్మకాలు చేపట్టి ఇక్కడ రైతుల కడుపు కొట్టారన్నారు. రైతులకు, ప్రభుత్వానికి అన్యాయం చేసిన వ్యక్తికి ఇప్పుడు మరలా ధాన్యం కొనుగోలు బాధ్యతలు ఎలా అప్పగిస్తారని అన్నారు. ఆ వ్యక్తి మిల్లులో ఆధునిక యంత్రాలు, సిబ్బంది లేరన్నారు. మూడేళ్లుగా మిల్లు పనిచేయడం లేదని వివరించారు. దీనిని అధికారులు పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్యే దృష్టికి తర్లి సమస్యలు

ప్రజాశక్తి- సారవకోట

మండలంలోని తొగిరి పంచాయతీ తర్లి సమస్యలను పరిష్కరించాలని టిడిపి యువ నాయకుడు పిళ్లా నందకిషోర్ కోరారు. ఈ మేరకు నరసన్నపేటలోని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని గ్రామస్తులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 2018లో టిడిపి హయాంలో నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. తరువాత ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయని వివరించారు. బిటి రోడ్డు లేక అవస్థలు పడుతున్నామని, రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బోనే జోగారావు, కుజ్జి అప్పారావు, పాల బారికివాడు, పిట్ల ఆదినారాయణ, పిట్ల చిన్నవాడు, బోనే జగ్గారావు, పిట్ల జగ్గారావు, పాల రాములు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రోడ్ల అభివృద్ధికి నిధులు

ప్రజాశక్తి- పోలాకి

నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.22.35 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో పంచాయతీశాఖ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిడిఒలు, పంచాయతీరాజ్ డిఇ సత్యంనాయుడు, జెఇలు పాల్గొన్నారు.

మల్చింగ్‌తో బహుళ ప్రయోజనాలు

ఆమదాలవలస : వ్యవసాయంలో మల్చింగ్‌తో బహుళ ప్రయోజ నాలు ఉన్నాయని డిజిటల్ ఎల్‌టు సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని చేపేనపేట యూనిట్ పరిధిలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా రబీ డ్రై షోయింగ్ పద్ధతుల్లో పంటల సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ డిపిఎం రేవతి ఆదేశాల ప్రకారం రైతులతో రబీ డ్రై షోయింగ్ కంపాక్ట్ బ్లాక్‌లను రైతులతో చేయిస్తున్నట్లు తెలిపారు. చేపేనపేటలో ఎ- గ్రేడ్ మోడల్ కాంపాక్ట్ బ్లాక్‌లో ఉన్న పలు రకాల కాయ గూరల పంటలకు మల్చింగ్ చేయడం జరిగిందన్నారు. గట్లపై ఉన్న కూరగాయల మొక్కలకు మల్చింగ్ చేయడం వలన నేరుగా పడే సూర్య రశ్మి తీవ్రతను పంటలపై పడకుండా చేస్తుందని అలాగే మొక్కలకు నీరు తడులు తగ్గించవచ్చునని తెలిపారు. ప్రస్తుతం అంతర పంటల సాగుపై రైతులతో క్షేత్రస్థాయిలో పని చేస్తున్నామని యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు తెలిపారు.

క్రీడాకారునికి సన్మానం

పలాస : మండలంలోని బొడ్డపాడుకు చెందిన జెస్సీ ఈవెంట్స్, కబడ్డీ క్రీడాకారుడు బి.సంతోష్ కుమార్‌కు బుధవారం సన్మానించారు. ఇటీవల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సంతోష్‌కుమార్ కడప జిల్లా తరుపున కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో కడప జిల్లా తృతీయ స్థానం సాధించారు. దీంతో పలాస తెలుగు యువత అధ్యక్షులు, జెస్సీ ఈవెంట్స్ నిర్వాహకులు కిక్కరి ఢిల్లీరావు, జెస్సీ ఈవెంట్ సభ్యులు అభినందించారు.

లబ్బలో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో లబ్బలో ఎంటి సూర్యనారాయణ, విఎఎ సుధాకర్ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాలు వేసిన జి.సింహాచలం పంటలో బుధవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు, 17.420 గ్రాములు దిగుబడి వచ్చింది. ఎకరాకు 34 బస్తాలు దిగుబడి అంచనా వేశారు. గతేడాది కంటే ఈ ఏడాది నాలుగు బస్తాలు అదనంగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు వరలక్ష్మి, యూనిట్ ఇన్‌ఛార్జి గోవిందరావు, ఐసిఆర్‌పిలు మోహిని, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న సిబ్బంది

సచివాలయాల సందర్శన

పాతపట్నం : మండలంలోని తెంబూరు, పెద్దలోగిడి, గంగువాడ, చంగుడి సచివాలయాలను ఎంపిడిఒ పి.చంద్రకుమారి బుధవారం సందర్శించారు. ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింకు, ఎన్‌పిసిఎల్, ఇంటింటికీ ట్యాగింగ్, చిన్న తరహా పరిశ్రమలపై పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించేందుకు కృషి చేయాలన్నారు.


అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రామకృష్ణ

ఆటపాటలతో విద్యాబోధన చేయాలి

ప్రజాశక్తి- జి.సిగడాం


అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఎంపిడిఒ టి.రామకృష్ణ అన్నారు. బుధవారం పెంట, నాగులవలసలో అంగన్వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రంగా అందించాలన్నారు. చిన్నారుల బరువును ఎప్పటికప్పుడు సరిచూడాలన్నారు. ఈయన వెంట కార్యదర్శి పొట్నూరు సురేష్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు మక్క విజయలక్ష్మి, సింగటాపు ఈశ్వరమ్మ, మక్క రూప, ప్రసన్న తదితరులున్నారు.

వార్డెన్‌పై వేధింపులు ఆపాలి

కొత్తూరు : మండలంలోని కురిగాం ఎస్‌సి బాలుర వసతిగృహంలో పనిచేస్తున్న వార్డెన్ టెక్కలి కష్ణారావుపై వేధింపులు ఆపాలని దళిత మహాసభ మండల నాయకులు బొడ్డేపల్లి కృష్ణారావు, నాస బాలకృష్ణలు హెచ్చరించారు. ఈ సందర్భంగా బుధవారం వసతిగృహాన్ని సందర్శించారు. ఈ వసతిగృహంలో 8 మంది విద్యార్థులు చదువుతున్నారని, వీరికి సక్రమంగా ఆహారాన్ని అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి లోటు లేకుండా చూసుకుంటు న్నారని తెలిపారు. కొంతమంది దళితేర విద్యార్థులు రాత్రిపూట ఉండకుండా వార్డెన్‌ను వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. వీరితో పాటు దళిత నాయకులు పడాల నాగ భూషణరావు, సూరిబాబు, ప్రశాంత్, లక్ష్మణరావు ఉన్నారు.

10న గణిత ఎగ్జిబిషన్

ఇచ్ఛాపురం : ఈ నెల 19న నిర్వహించాల్సిన మండలస్థాయి గణిత ఎగ్జిబిషన్ అనివార్య కారణాల వల్ల ఈ నెల 10కి మార్చామని గణిత అధ్యాపకులు ప్రతినిధి కె.తేజేశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఎస్‌ఎ-1 పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఎగ్జిబిషన్‌ను మార్పు చేశామన్నారు. మండలంలోని తోటూరు ఎంపియుపి, పంజా స్కూల్‌లో నిర్వహిస్తున్నామని అన్నారు. మండలంలోని ప్రైమరీ, యుపి, ఉన్నత పాఠశాలల్లో చదువుకున్న 3 నుంచి 8 తరగతి విద్యార్థులు పాల్గొనేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న కమిషనర్ రామారావు

గ్రీవెన్స్‌కు 12 దరఖాస్తులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్‌కు 12 దరఖాస్తులు వచ్చాయి. గ్రీవెన్స్‌లో రామకృష్ణాపురం, బొడ్డపాడు-2, తర్లకోట అర్బన్ లేఅవుట్లలో ఇళ్లు, టిడ్కో ఇళ్ల కేటాయింపులకు సంబంధించి పలు దరఖాస్తులు వచ్చాయి. బిల్లులు, ఇసుక వంటి సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు మాట్లాడుతూ టిట్కో ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా రావాల్సి ఉందన్నారు. ఇళ్ల కోసం సొమ్మును డిపాజిట్ చేసిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.


దుప్పట్లను పంపిణీ చేసిన గృహలక్ష్మి

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అమ్మనాన్న ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన మండలంలోని అక్కుపల్లిలో వృద్ధులకు బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే కిడ్నీ బాధితుడు రాముకు రూ.ఐదు వేలు నగదు, దప్పటి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మారడ గృహలక్ష్మి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ఏటా కిడ్నీ బాధితులకు ఆర్థికసాయం, శీతాకాలంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

వంద రోజుల పని కల్పించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని 38 పంచాయతీల్లో ఉపాధి హామీలో 88 నుంచి 99 రోజులు పనిచేసి ఉన్న కుటుంబాలకు వంద రోజులు పూర్తి అయ్యేవిధంగా పనులు కల్పించాలని ఎంపిడిఒ కె.ఫణేంద్రకమార్ తెలిపారు. ఎన్‌సిసి కార్యాలయ సమావేశ మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు కల్పించడంలో అలసత్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.హరిప్రసాద్, ఎస్.ఆర్.కె.తిరుపతిరావు, ఇసి టి.రాంబాబు పాల్గొన్నారు.